
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# చేవేళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అండతో రూ.30 కోట్లు విలువ చేసే భూ కబ్జా

## - కందుకూరు మండలం పులిమామిడి రెవెన్యూలో అక్రమ కట్టడాలను కూల్చివేసిన వందల మంది బాధితులు


భూ కబ్జాను అడ్డుకుంటున్న బాధితులు.

**మహేశ్వరం, డిసెంబర్ 14, (ప్రభాతవార్త) :** కందుకూరు మండలం పులిమామిడి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 93లో 30 కోట్ల విలువ చేసే పది ఎకరాల భూమిని చేవేళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, అతని వ్యాపార భాగస్వామి తిరుపతిరెడ్డి అండతో కొంత మంది వ్యక్తులు అక్రమ కబ్జాకు పాల్పడి గోడలు నిర్మించారని తెలంగాణ వెల్ఫేర్ గ్రూప్ ఆఫ్ కంపెనీ బాధితులు బుధవారం ఆందోళనకు దిగారు. పులిమామిడి సర్వే నెంబర్ 93లో 10 ఎకరాల భూమిని 2008లో ఎ.కె.ఎస్టేట్స్ వారి నుంచి విజయవాడకు చెందిన మాజీ ఎమ్మెల్యే మల్ల విజయ ప్రసాద్ కొనుగోలు చేసి వెంచర్ చేశారు. ఇట్టి స్థలంలో తెలంగాణలోని కరీంనగర్, కామారెడ్డి, ఆర్మూర్, బోదన్, నిజామాబాద్, సిద్దిపేట, మేదక్, సంగారెడ్డి, నారాయణఖేడ్, సిరిసిల్లా, హైదరాబాద్‌లకు చెందిన వెల్ఫేర్ గ్రూప్ సభ్యులకు కేటాయించారు. ఇటీవల ఇదే స్థలం రాజకీయ అండతో కబ్జాకు గురికావడంతో స్థల యజమాని మల్ల విజయప్రసాద్‌తో పాటు ఐదు వందల మంది బాధితులు ఆందోళనకు దిగి అక్రమ కట్టడాలను కూల్చివేశారు. వందల మంది ఆందోళన చేపట్టినా కందుకూరు పోలీసులు కూడా స్పందించకపోవడం పట్ల బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ జిల్లాలకు చెందిన సుమారు వేలాది మంది బీడీ కార్మికులు, చిరు వ్యాపారులు ప్రతినెల నాలుగైదు వందలు వాయిదా పద్ధతిలో వెల్ఫేర్ సొసైటీ గ్రూపులో డబ్బు పొదుపు చేసి ఇంటి స్థలాల కోసం ఒత్తిడి తేవడంతో స్థలం యాజమాన్యం స్పందించి బాధిత సభ్యులందరిని పులిమామిడి తరలించి పోరాటానికి సిద్ధమయ్యారు. జేసీబీ యంత్రాల సహాయంతో గోడలను కూల్చివేసి నిరసనకు దిగారు. ఎంపీ రంజిత్ రెడ్డి అండతో స్థానిక నాయకుడు హనుమంత్‌నాయక్‌తో కొంత మంది కలిసి కబ్జాకు పాల్పడిన భూమిని పేద ప్రజలకు అప్పజెప్పాలని అంటున్నారు. వెల్ఫేర్ గ్రూప్ ఖాతాదారులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే రంజిత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

# నా పార్లమెంట్ పరిధిలోని రైల్వే స్టేషన్లను ఎప్పుడు అభివృద్ధి చేస్తారు

## - ఎంపీ రంజిత్‌రెడ్డి

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్ 14, (ప్రభాతవార్త) :** చేవేళ్ల పార్లమెంట్ పరిధిలోని రైల్వే స్టేషన్ల పరిస్థితి ఏంటి....? వాటిని ఎప్పటి వరకు అభివృద్ధి చేస్తారు అని బీఆర్ఎస్ చేవేళ్ల ఎంపీ డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి బుధవారం లోక్‌సభలో కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి ఆశ్వీని వైష్ణవ్ రాతపూర్వక సమాధానం తెలిపారు. చేవేళ్ల లోక్‌సభ పరిధిలోకి వచ్చే లింగంపల్లి, శంకర్‌పల్లి, తాండూరు, ఉద్గరీ మరియు వికారాబాద్ రైల్వే స్టేషన్లను ఆదర్శ్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేసేందుకు గుర్తించారా...? ఒక వేళా గుర్తిస్తే పథకం అమలులోకి వచ్చినప్పటి నుండి పైన పేర్కొన్న ప్రతి స్టేషన్‌లో స్టేషన్ల వారీగా చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు ఏవి...? ఇంకా పూర్తి చేయాల్సిన పనుల ఏమైనా ఉన్నాయా...? ఉంటే అవి ఎంత సమయానికి పూర్తవుతాయి అని ఎంపీ రంజిత్ రెడ్డి పార్లమెంట్ వేదికగా కేంద్రాన్ని ప్రశ్నించారు.

# ఓటరు దరఖాస్తుల డిజిటలైజేషన్స్‌ను వెంటనే పూర్తి చేయాలి

**-రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ వీడియో సమావేశం**

**-పాల్గొన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ నిఖిల, మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆమోయ్ కుమార్**


విడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వికారాబాద్ కలెక్టర్ నిఖిల

### వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ఓటర్ నమోదు దరఖాస్తుల డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు.బుధవారం హైదరాబాద్ నుండి ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి టి.రవి కిరణ్‌తో కలిసి జిల్లా కలెక్టర్‌లతో ఓటర్ నమోదు సవరణలకు సంబంధించిన ఫారం 6,7,8 ఆన్‌లైన్ డేటా ఎంట్రి ,ఓటర్ జాబితా రూపకల్పనపై వీడియో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో వచ్చిన దరఖాస్తులను డిజిటలైజేషన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.జిల్లాల వారీగా నూతన ఓటరు నమోదు,ఓటరు జాబితా సవరణ కొరకు వచ్చిన దరఖాస్తులను డిసెంబర్ 26లోపు పరిశీలించి డిస్పోజ్ చేయాలని అర్హత కల్గిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని ఆయన సూచించారు.ఉపాధి దృష్ట్యా కొంత మంది వలస వెళ్లిన వారు పట్టణాలలో జీవిస్తున్నప్పటికి గ్రామాల్లో కూడా వారికి ఓటు హక్కు ఉంటుందని రెండు ప్రాంతాల్లో ఓటరుగా నమోదు చేసుకున్న వివరాలు పరిశీలించి అధికారులతో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ఈఆర్‌ఓలు చర్య తీసుకోవాలని ఆయన సూచించారు.ఓటరు నమోదు సమయంలో ట్రాన్స్‌జెండర్లు,సెక్స్ వర్కర్లు వివిధ ప్రత్యేక వర్గాల వారందరి పేర్లు ఓటరు జాబితాలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన దివ్యాంగులందరికి ఓటు హక్కు కల్పించి పోలింగ్ కేంద్రాల వారిగా మ్యాపింగ్ చేయాలని తెలిపారు.జిల్లాలలో 100 సంవత్సరాలు నిండిన ఓటర్ల వివరాలను కూడా ధృవికరించాలని ఆయన సూచించారు.ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌లను ఆదేశించారు.ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ నిఖిల,జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ,జిల్లా రెవెన్యూ అధికారి అశోక్ కుమార్, పాల్గొన్నారు.

### మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో


మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్,పాల్గొన్న అదనపు కలెక్టర్లు, డిఆర్‌ఓ, జిల్లా అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబరు 14, ప్రభాతవార్త :** ఓటరు ధరఖాస్తుల డిజిటలైజేషన్స్‌ను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ హరీశ్, జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు. నగరం నుంచి ఆయనతో పాటు సంయుక్త ఎన్నికల అధికారి రవికిరణ్‌తో కలిసి జిల్లాల కలెక్టర్లతో ఓటరు నమోదు, సవరణలకు సంబంధించి ఫారం 6,7,8 ఆన్‌లైన్ డేటా ఎంట్రీ, ఓటరు జాబితా రూపకల్పనపై వీడియో సమావేశం నిర్వహించి వారు సమీక్షించారు. క్షేత్ర స్థాయిలో వచ్చిన ఓటరు ధరఖాస్తులను డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఉపాధిక కోసం కొందరు పట్టణాలల్లో నివాసం ఉంటున్నారని, గ్రామాల్లో వారికి ఓటు హక్కు ఉంటుందని, రెండు చోట్ల ఓటరు నమోదును పరిశీలించి అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఈఆర్‌ఓలు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో వచ్చే సంవత్సరం సార్వత్రిక ఎన్నికలు ఉన్నాయని, అధిక సంఖ్లఓ ఓటరు నమోదు ప్రక్రియ జరిగే అవకాశం ఉందని, ప్రస్తుతం పకడ్బంధీగ ఓటరు జాబితా సిద్ధం చేస్తే ఎన్నికల సమయంలో ప్రక్రియ సజావుగ జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సూచనలను అధికారులు అందరు విధిగా పాటించేలా చర్యలు తీసుకోవటం జరుగుతుందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ తరువాత జిల్లా అధికారులతో దీనిపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో వచ్చిన ధరఖాస్తులను పరిశీలించాలని, జాబితాలో పుట్టిన తేదీ, పేరు మార్పు, చేర్పులు, ఫోటో క్లారిటీ, జిల్లాలో ట్రాన్స్‌జెండర్స్ ఓటరు నమోదు తప్పకుండ చేయాలని సూచించారు. ఈ విషయంలో ఈఆర్‌ఓలు ప్రత్యేక దృష్టిని సారించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, కలెక్టరేట్ ఎఒ వెంకటేశ్వర్లు, ఈఆర్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

### రంగారెడ్డిజిల్లా కలెక్టరేట్‌లో


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆమోయ్‌కుమార్ తదితరులు.

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్ 14, (ప్రభాతవార్త) :** ప్రత్యే ఓటరు నమోదు కారనక్రమంలో భాగంగా వచ్చిన ధరఖాస్తులను ఈనెల 26వ తేది నాటికి పూర్తిగా పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 8వ తేది వరకు స్వీకరించిన ధరఖాస్తులకు సంబంధించి ఆన్‌లైన్లో డేటా ఎంట్రీ పూర్తి చేసిన నేపథ్యంలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా క్షుణ్ణంగా స్క్రూటినీ జరపాలన్నారు. వచ్చే నెల జనవరి 5న ఓటర్ల తుది జాబితాను ప్రకటించాల్సి ఉన్నందున, పరిశీలన ప్రక్రియలో జాప్యానికి తావు లేకుండా వెంట వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు రోజువారిగా ధరఖాస్తుల పరిశీలన ప్రగతిని సమీక్షించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆమోయ్ కుమార్ మాట్లాడుతూ... జిల్లాలో ఫారం 6,7,8 వచ్చిన ధరఖాస్తులను పరిశీలించి డిజిటలైజ్ చేయడం జరిగిందని, పెండింగ్‌లో ఉన్న 835 ధరఖాస్తులను వెంటనే పరిశీలించి డిజిటలైజ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

# ఢిల్లీలోని పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో మంత్రి


ఎమ్మెల్సీ కవితతో మాట్లాడుతున్న మంత్రి

**మహేశ్వరం, డిసెంబర్ 14, (ప్రభాతవార్త) :** ఢిల్లీలో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిల్లా నాయకురాలు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, కేసీఆర్ సతీమణి శోభలతో మాట్లాడుతున్న మంత్రి. మంత్రితో పాటు జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అంబోతు రాజునాయక్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు థామస్‌రెడ్డి, మహేశ్వరం, తుక్కుగూడ పలు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఢిల్లీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం పాల్గొన్నారు.

# పిచ్చిమొక్కలకు అడ్డాగా షాద్‌నగర్ ప్రభుత్వ కార్యాలయాలు

**- మండల ప్రజాపరిషత్ ఆవరణలో విచ్చలవిడిగా పెరిగిన పిచ్చి మొక్కలు**

**- కనిపించకుండా ఉంటున్న ప్రభుత్వ కార్యాలయాలు**

**- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు**

**- కొత్త వారు ప్రభుత్వ కార్యాలయాలకు వస్తే దేవులాడుకునే పరిస్థితి**


ఎంపీడీఓ సమావేశ మందిరం వెనుక వైపు ఇలా.


వ్యవసాయ కార్యాలయం వైపు..

**షాద్‌నగర్, డిసెంబర్ 14, (ప్రభాతవార్త) :** పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం సాధ్యమౌతుందని... పరిసరాలను, ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా పరిశుభ్రతపై ఎన్నో కార్యాక్రమాలను చేపడుతుంది... కార్యాక్రమాలు ప్రజలకు చేరేవిధంగా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు ఉంటుంది. అదేవిధంగా రాష్ట్రంలో ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లిన అక్కడ అధికారులు కార్యాలయాల ఆవరణలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఇతరులకు ఆదర్శంగా నిలబడతారు. కానీ మన షాద్‌నగర్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. మరి ఆ పరిస్థితిని ఓ సారి పరిశీలిస్తే....

### ఇదీ పరిస్థితి....

తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో షాద్‌నగర్ పట్టణం ఒక్కటి అన్న విషయం అందరికి తెలిసిందే... మరీ అలాంటి పట్టణంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు ఎంత పరిశుభ్రంగా ఉండాలి కాదా... కానీ ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మాత్రం పరిశుభ్రత ఎక్కడ వేసిన గొంగళీ అక్కడే అన్న చందంగా తయారైంది. పచ్చదనం పరిశుభ్రత పాటించాలని సాక్షాత్ ప్రభుత్వ అధికారులే ప్రతి ఏటా ఎన్నో కార్యాక్రమాలు చేపట్టి ప్రజలకు వివరించే వారే నేడు ఆ పరిశుభ్రత మరిచిపోతున్నారు.

### అన్ని కార్యాలయాల వద్ద ఇదే పరిస్థితి...

మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో శ్రీ శిశుసంక్షేమా శాఖ కార్యాలయం, వ్యవసాయ కార్యాలయం, ఆర్ అండ్ బి కార్యాలయం, ఈజీఎస్ కార్యాలయం, పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయం, పశుసంవర్ధక శాఖ కార్యాలయం వంటి పలు కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. వాటి మధ్యన ఉన్న ఖాళీ స్థలాల్లో విచ్చలవిడిగా పిచ్చి మొక్కలు పెరిగిపోయి ఆయా కార్యాలయాలు సహితం కనిపించలేని పరిస్థితి. ఆయా కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు కార్యాలయాలను దోలాడుకునే పరిస్థితి నెలకొని ఉందని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ప్రజలకు చెప్పే ప్రభుత్వా అధికారులే ఇంత నిర్లక్ష్యంగా ఉంటారా అని పలువురు సామాన్య ప్రజలు చర్చించుకుంటున్నారు.

### అవసరం ఉన్నంత మేరకే తొలగిస్తున్న వైనం...

ఆయా కార్యాలయాలకు వెళ్లేందుకు అధికారులు తమకు అవసరం ఉన్నంత మేరకే తొలగిస్తూ మిగితా చోట్లలో అలాగే వదిలేస్తున్నారు. దీంతో చీకటి కార్యాకలాపాలకు అడ్డాగా మారే అవకాశం, అదేవిధంగా మందు బాబులకు సహితం ఒక అడ్డాగా మారే అవకాశం లేకపోలేదని పలువురు స్థానికులు చేర్చించుకుంటున్నారు. ఇదీ కాకుండా పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో పాములు, పురుగు, పందులు వచ్చే పరిస్థితి ఉందని, గత రెండు నెలల క్రితం ఓ ప్రభుత్వ కార్యాలయంలో రికార్డుల మధ్య ఓ పాము వచ్చిన దాఖాలలు సహితం ఉన్నాయి.

### ఏపుగా పెరిగిన మొక్కలు... పట్టించుకోని అధికారులు.

ఈ ఏడాది భారీగా కురిసిన వర్షాల కారణంగా ఆయా కార్యాలయాల మధ్యన ఉన్న ఖాళీ స్థలాల్లో విచ్చల విడిగా పిచ్చి మొక్కలు పెరిపోయాయి. వివిధ పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఆ కార్యాలయాలు తెరిచి ఉన్నాయో, మూసి ఉన్నాయో తేలియని స్థితిలో కనిపిస్తున్నాయి.దగ్గరికి వెళ్లి చూస్తే కానీ తేలియని పరిస్థితి. ఇకనైనా సంబంధిత అధి.కారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయల సముదాయాల్లో విచ్చల విడిగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉంచుతారో లేదో చూడాలి మరి.

# జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు, ఆందోళనలు

## - పలు చోట్ల కెసిఆర్ దిష్టిబొమ్మలు దగ్ధం



**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్ 14, (ప్రభాతవార్త) :** టీఆర్ఎస్ పార్టీ ప్రజావ్యతిరేకాలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీపై కక్ష్యపూరితంగా వ్యవహరిస్తూ మంగళవారం రాత్రి నగరంలోని కాంగ్రెస్ పార్టీ వార్ రూంపై సైబరాబాద్ క్రైం పోలీసులు దాడి చేయడానికి నిరసనగా మంగళవారం రాత్రి నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగారు. సైబరాబాద్ పోలీసుల తీరుకు నిరసనగా మంగళవారం రాత్రే పోలీసులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ వార్ రూం ముందే పలువురు రంగారెడ్డి జిల్లా, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు నిరసనకు దిగిన విషయం తెలిసిందే. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా టీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నియోజకవర్గాలు, మున్సిపలిటీలు, మండల కేంద్రాలలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలి వచ్చి రాష్ట్ర ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. దిష్టిబొమ్మ దగ్ధ సమయంలో పలు ప్రాంతాల్లో పోలీసులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు తోపులాటలు జరిగినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, అనుబంధ సంఘాల నాయకులు భారీగా తరలి వచ్చి ప్రధాన కూడలీ వద్ద కేసీఆర్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థలు ఎన్ఎస్‌యూఐ కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేయగా మహేశ్వరం, షాద్‌నగర్ నియోజ కవర్గ కేంద్రంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. తలకొండపల్లి, కడ్తాల్, ఆమనగల్లు, శంషాబాద్, చేవేళ్ల తదితర మండల కేంద్రాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు టీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకం గా నినాదాలు చేస్తూ ర్యాలీలు నిరసనలు వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతి రేకంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ విధివిధానాలను ఓర్వాలేకనే ఒక పథకంలో భాగంగానే కాంగ్రెస్ పార్టీ వార్ రూంపై పోలీసులతో దాడి చేయించారని, ఇలాంటి దాడులతో కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తల ను బయభ్రాంతులకు గురి చేయాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. ము న్ముందు టీఆర్ఎస్ ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడుతున్నాయని ఆయన హెచ్చరించారు. పోలీసులను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడం సిగ్గుచేటని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఈఎంఆర్‌ఐని సందర్శించిన అమెరికా విస్కోసిస్ యూనివర్శిటీ పరిశోధకులు

**మేడ్చల్, డిసెంబక్ 14. ప్రభాతవార్త ః** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పశు ఆరోగ్య సేవ సంచార వాహన పథకాన్ని పరిశీలించేందుకు విచ్చేసిన అమెరికా విస్కోసిస్ యూనివర్శిటీ పరిశోధకులు బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి నుంచి అందిస్తున్న సేవలు గురించి కూలకుశంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్ అవెన్‌సన్, డాక్టర్ జానె, డాక్టర్ క్రిష్టాఫర్, డాక్టర్ కియత్, డాక్టర్ ర్యాన్, ఈఎంఆర్ఐ సిబ్బంది పాల్గొన్నారు.



ఈఎంఆర్‌ఐని సందర్శించిన అమెరికా విస్కోసిస్ యూనివర్శిటి పరిశోధకులు

# ప్రజాసమస్యలు తీర్చాలని బిజెపి నాయకుల ధర్నా

**ఘట్‌కేసర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బిజెపి మండలశాఖ అధ్యక్షులు చలువాది ప్రవీణ్‌రావు విమర్శించారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామంలో బుధవారం గ్రామ అభివృద్ధి, సమస్యలపై బిజెపి నాయకులు ధర్నా నిర్వహించారు. గ్రామ బిజెపి అధ్యక్షులు ఎర్రోళ్ల కుమారస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో మండల బిజెపి అధ్యక్షులు చలువాధి ప్రవీణ్‌రావు, ప్రధానకార్యదర్శి రాచకట్ల శ్రీశైలంలు పాల్గొని మాట్లాడుతూ గ్రామకార్యదర్శి పనితీరును ఎండగట్టారు. ఇంటిపన్నుల వసూలు కోసం చావు డప్పుమోగించి ప్రజలపై ఒత్తిడి తెస్తున్నారని, బిజెపి కార్యకర్తలపై కక్ష్యగట్టి ఆస్తులు జప్తు చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోకాలంగా ఉన్న నీటి సమస్యను పరిష్కరించడంలో కార్యదర్శి బాధ్యతారహితంగా వ్యవహిరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఉన్న బోర్లకు మోటార్లు, స్టార్టర్లు తొలగించడంతో నీటి సరఫరాకు ఆటంకం కల్గుతుందని వెంటనే వాటిని బిగించి ప్రజలకు నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా కక్ష్యపూరిత చర్యలును మానుకొని ప్రజాసమస్యలను తీర్చి అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్యదర్శి, పాలకవర్గం కృషి చేయాలని వారు సూచించారు. ఈకార్యక్రమంలో మండల ఎస్సీ మోర్చ అధ్యక్షులు సంకు మల్లేశ్, ఓబీసీ మోర్చ నాయకులు వెంకటేశ్, యువమోర్చ నాయకులు హరికృష్ణ, బూత్ అధ్యక్షులు తోటకూర శ్రీనివాస్, పోలు నర్సింగ్‌రావు, కానుగంటి అంజనేయులు, ఎంకె. వంశీ, అలివాద సాయికిరణ్, తోటకూరి నరసింహ, సుంకరిచందు, బిజిలి శ్రీకాంత్ పాల్గొన్నారు.


ఎదులాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

# తాండూరులో తాగునీటి గోస .!

**- నాలుగు రోజులుగా మిషన్ భగీరథ బంద్**

**- కాగ్నా పంప్‌హౌస్‌కు మంగళం**

**- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు**

**- పట్టించుకొని పాలకులు, అధికారులు**



**తాండూరు, డిసెంబరు 14, ప్రభాతవార్త :** తాండూరులో త్రాగునీటి గోస తీవ్రరూపం దాల్సింది. గత నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. పట్టణంలో త్రాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా కాగ్నా నది పంప్‌హౌస్ ద్వార త్రాగునీటి సరఫరా చేస్తారనుకున్నా.. అధికారులు, పాలకుల పర్యవేక్షణ లేక పూర్తిగా పంప్‌హౌస్‌కు మంగళం పాడారు. రూ. లక్షలు వెచ్చించి కాగ్నా పంప్ హౌస్ మరమ్మత్తు చేపించినా.. మిషన్ భగీరథ సాకుతో అధికారులు పూర్తిగా గాలికొదిలేశారు. ప్రస్తుతం కాగ్నా నీటి సరఫరా లేక పోవడం, మిషన్ భగీరత నీరు సరఫరా కాక పోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. తాండూరు పట్టణంలో త్రాగునీటి గోస ఏర్పడినా పాలకులు గాని, వార్డు కౌన్సిలర్లు కాని పట్టించుకోకపోవడం శోచనీయమని పలువురు పెదవివిరుస్తున్నారు. పదవుల కోసం పాకులాడుతున్న పాలకులు ముందు ప్రజల సమస్యలు పట్టించుకోవాలని చురకలు వేస్తున్నారు. అధికార పార్టీలో కొనసాగుతున్న వర్గ పోరుతో తాండూరు మున్సిపాల్టీని పూర్తిగా బ్రస్టుపట్టిస్తున్నారని మండిపడుతున్నారు. వార్డులలో ప్రత్యామ్నాయంగా త్రాగునీటి సరఫరా చేయాల్సిన కౌన్సిలర్లు కన్నెత్తి చూడటం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి పట్టణంలో త్రాగునీటి గొస తీర్చాలని, లేదంటే తాండూరు ప్రజల ఉద్వేగాన్ని తట్టుకోలేరని అంటున్నారు.

## మేడ్చల్ జిల్లా ఎస్‌జిఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వినోద్‌కుమార్



మేడ్చల్ డిఈఓ విజయకుమారి నుంచి నియామకపత్రం అందుకుంటున్న పీడీ వినోద్‌కుమార్

**ఘట్‌కేసర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి.వినోద్‌కుమార్ నియమితులయ్యారు. ఘట్‌కేసర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పిజికల్ డైరక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వినోద్ కుమార్ సీనియారిటీ ప్రకారం రెండేళ్ల పాటు ఎస్‌జిఎఫ్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. ఈమేరకు మేడ్చల్ జిల్లా విద్యాశాఖాధికారిణి ఐ.విజయకుమారి ఆయన నియామకపు ఉత్తర్వులను జారీ చేయగా ఆమె చేతుల మీదుగా వినోద్‌కుమార్ అందుకున్నారు. ఈసందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎస్‌జిఎఫ్ బాధ్యతలు అప్పగించినందుకు డిఈఓకు కృతజ్ఞతలు తెలియజేశారు. మేడ్చల్ జిల్లాలోని విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తూ క్రీడల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పీడీలు ప్రభాకర్, పిఇటి సత్తిరెడ్డిలు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఘట్‌కేసర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** రోడ్డు వెడల్పు పనుల కారణంగా గురువారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఘట్‌కేసర్ ఏఇ సతీష్‌కుమార్ తెలిపారు. అన్నోజీగూడలో రోడ్డు వెడల్పు పనులు చేస్తున్న కారణంగా సింగపూర్ 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని ఆర్‌జికె 11కెవి ఫీడర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ ఉండదని తెలిపారు. అన్నోజీగూడ రాజీవ్‌గృహకల్పకాలనీ, సూర్యనగర్ సమీప కాలనీల్లో మూడు గంటల పాటు విద్యుత్ నిలిపివేస్తున్నా మని విని యోగదారులు గమనించి తమకు సహకరించాలని ఏఇ కోరారు.

### బొడ్రాయి పున ః ప్రతిష్ట ఉత్సవాన్ని విజయవంతం చేయాలి

- చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి

**మేడ్చల్, డిసెంబక్ 14. ప్రభాతవార్త ః** మేడ్చల్‌లో నేటి నుండి నిర్వహించే బొడ్డురాయి పున:ప్రతిష్ట ఉత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఉత్సవంలో భాగంగా నేడు గణపతి పూజతో ప్రారంభించి ఈ నెల 18న బొడ్డురాయి ప్రతిష్ట, బోనాలు కార్యక్రమాలతో పాటు ప్రతిరోజు పూజా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రజలందరూ ఉత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ పండుగకు సహకరిస్తున్నందుకు అభినందనీయమని అన్నారు.

## దివ్యాంగుల ఎదుగుదలకు సహకరించాలి

### -మేడ్చల్ ఎంపిపి రజిత రాజమల్లారెడ్డి



వికలాంగులకు బహుమతులు అందజేస్తున్న ఎంపిపి రజిత రాజమల్లారెడ్డి

**మేడ్చల్, డిసెంబక్ 14. ప్రభాతవార్త ః** ప్రత్యేక అవసరాలు గల పిల్లలను సమాజంలో ఎదుగుదలకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని మేడ్చల్ ఎంపిపి రజితా రాజమల్లారెడ్డి అన్నారు. మేడ్చల్‌లోని భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులకు భవిత కేంద్రం ద్వారా నేర్పిస్తున్న శిక్షణను తీసుకుని లబ్ధి పొందాలని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగులను అన్ని విదాల ఆదుకుంటున్నదని అన్నారు. సమాజంలో దివ్యాంగులు కూడ ఒకరుగా గుర్తించి ఎదిగేందుకు సహకరించాలని, వారి అభ్యున్నతికి తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ పద్మావతి, ఎంఈవో వసంత కుమారి, ఐఈఆర్పీ యమున, సీఆర్పీలు రమేష్, మల్లేష్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం

### -డిసిసిబి చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి



క్రీడాకారిణిని సన్మానిస్తున్న డిసిసిబి చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి

**దోమ,కుల్కచర్ల డిసెంబర్ 13,ప్రభాతవార్త :** క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తామని డిసిసిబి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు.బుదవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని తిర్మలాపూర్ గ్రామంలోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన వారిని సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ మండల పరిదిలోని దొంగ ఎన్కేపల్లికి చెందిన మంజుల ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తూ డిసెంబర్3,4 తేదీలలో మలేసియాలో జరిగిన ఇంటర్నేషనల్ మాస్టర్స్‌అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో పాల్గొని రన్నింగ్‌లో గోల్డ్ మెడల్,హైజంప్‌లో సిల్వర్,400 మీటర్ల రన్నింగ్‌లో సిల్వర్ పథకాలు సాదించడం అభినందనీయమని అన్నారు.క్రీడాకారులను ప్రోత్సహించడానికే ఆమెకు సత్కారం అందించామని ఆయన తెలిపారు.త్వరలో కౌలాలంపూర్‌లో జరిగే పోటీల్లో పాల్గొని దేశ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రాంలాల్,మొగులయ్య, యాదయ్యగౌడ్, శివకుమార్‌గౌడ్, సంజీవ్‌కుమార్,సాయిబాబ శ్రీనివాస్,కృష్ణయ్య,రవిందర్‌గౌడ్ మరియు ఆమె కుటుంబ సబ్యులు పాల్గొన్నారు.

## ఉరివేసుకోని వ్యక్తి ఆత్మహత్య

**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** ఉరివేసుకోని ఓ వ్యక్తి హత్మహత్యకు పాల్పడిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.సిఐ రామకృష్ణ తెలిపాన వివరాలు ఇలా ఉన్నాయి.రమేష్ చౌదరి(34) మగల్‌పల్లిపటేల్ గూడ గ్రామంలో కిరాణ షాపు నడుపుతున్నడు.బుదవారం ఇబ్రహీంపట్నంలో కిరాణ సామాను తీసుకవస్తానని ఇం ట్లో చెప్పి బయటికి వెళ్ళాడు.మానసిక వత్తిడి కారణంగానే చెట్టుకు ఉరి వేసుకోని హత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.కుటుంబ సభ్యు ల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ తెలిపారు.

### బైకును ఢీకొన్న మాడ్గుల తహసీల్దార్ కారు

-ఇద్దరికి తీవ్ర గాయాలు

**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం తహసీల్దార్ దేవూజనాయక్ కారు ఇబ్రహీంపట్నం గురునానక్ కాళాశాల సమీపంలో ఎరుగుగా వస్తున్న బైకును డీ కోంది.ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.కాగా తహసీల్దార్ దేవూజ నాయక్ కారును విఆర్‌ఏ మణికంఠ నడుపుతున్నట్లు ఇబ్రహీంపట్నం సిఐ రామకృష్ణ తెలిపారు.

# కీసరలో అక్రమ షెడ్ల నిర్మాణాలపై పంచాయతీ కార్యదర్శికి వార్డు సభ్యుడు ఫిర్యాదు

- షెడ్ల నిర్మాణాలకు అనుమతులు ఎవరిచ్చారు ?
-వందల సంఖ్యలో అక్రమ ఇళ్ల నిర్మాణాలు
-భారీ ఎత్తున పంచాయతీ ఆదాయానికి గండి
-అధికారులు చర్యలు తీసుకోవాలి
-విలేకరుల సమావేశంలో వార్డు సభ్యులు రామారం ప్రదీప్‌కుమార్



అక్రమ షెడ్ల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న వార్డు సభ్యులు రామారం ప్రదీప్‌కుమార్



కీసరలో అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డు నిర్మాణం

**కీసర,డిసెంబరు14,ప్రభాతవార్తః** మండల కేంద్రమైన కీసర గ్రామ పంచాయతీలో విచ్చలవిడిగా అక్రమ షెడ్లు, అక్రమ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వెంటనే క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తే కీసరలో జరుగుతున్న అవినీతి బయట పడుతుందని 2వ వార్డు సభ్యులు రామారం ప్రదీప్‌కుమార్ డిమాండ్ చేశారు. బుదవారం కీసర గ్రామ పంచాయతీ కార్యదర్శికి అక్రమంగా అనుమతులు లేని షెడ్లు,ఇళ్ల నిర్మాణాలు వందల సంఖ్యలో జరుగుతున్నవని వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.అనంతరం కీసరలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కీసర గ్రామ పంచాయతీలో నిర్మిస్తున్న షెడ్లు,ఇళ్లకు అనుమతులు ఎవరు ఇచ్చారు..? ఎప్పుడిచ్చారు..? ఏ ధైర్యంతో అట్టి నిర్మాణాలు కొనసాగిస్తున్నారు..? వాటి వెనుక ఉన్న వ్యక్తి ఎవరు..? ఎవరెవరికి ఎంతెంత ముడుపులు ముట్టజెప్పి పనులు చేపడుతున్నారు..? గ్రామ పంచాయతీకి రావాలసిన ఆదాయానికి ఎంత గండి కొడుతున్నారు..? అనే దానిపై ఉన్నతాధికారులు విచారణ చేయాలని డిమాండ్ చేశారు.కీసరలో 90 శాతం అక్రమంగా అనుమతులు లేకుండా షెడ్లు,ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని,పేద ప్రజలు ఇళ్ల స్థలాలకు ఎల్‌ఆర్‌ఎస్ లేదని బెదిరిస్తూ,అక్రమంగా పంచాయతీ కార్యాలయంలో డబ్బులు వసూలు చేస్తూ అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఈ విషయమై ఎంతో మంది సామాన్య ప్రజలు నా దగ్గరికి తమ గోసను వెళ్ల బుచ్చుకున్నారని తెలిపారు.ఇట్టి విషయమై పంచాయతీ కార్యదర్శి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అట్టి అమాయక ప్రజలను కాపాడాలని కోరారు.ఇట్టి విషయమై పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

# మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట బిఆర్‌ఎస్ ధర్నా

- చేపల విక్రయ కేంద్రం వద్ద చెత్త వేయడాన్ని నిరసన
-మాడ్గుల రోడ్డుపై విక్రయదారులు, బిఆర్‌ఎస్ రాస్తారోకో
-మున్సిపాలిటీ చర్యను తప్పుబట్టిన బిఆర్‌ఎస్



బిఆర్‌ఎస్ రాస్తారోకో, ధర్నాలో మాట్లాడుతున్న పత్యనాయక్



చేపల విక్రయ కేంద్రం వద్ద మున్సిపాలిటీ వేసిన చెత్త

**ఆమనగల్లు, డిసెంబర్14, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలో ఉన్న చేపల విక్రయ కేంద్రాలను తొలగించేందుకు మున్సిపాలిటీ తీసుకున్న చర్య అత్యంత బాధకరమని బిఆర్‌ఎస్ పార్టీ మున్సిపాలిటీ కన్వీనర్ నేనావత్ పత్యనాయక్ అన్నారు. పట్టణంలో సేకరించిన చెత్తను పెద్ద ఎత్తున తీసుకువచ్చి విక్రయ కేంద్రాల వద్ద వేయడం వ్యాపారుల పట్ల మున్సిపాలిటీకి ఉన్న బాధ్యతరహితానికి నిదర్శనమన్నారు. మున్సిపాలిటీ చర్యను ఖండిస్తూ పట్టణ బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. చేపల విక్రయదారులతో కలిసి మాడ్గుల రోడ్డుపై భైఠాయించి కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ర్యాలీగా మున్సిపాలిటీ కార్యాలయానికి చేరుకుని ఆంధోళన చేపట్టారు. ఈసంధర్భంగా పత్యనాయక్ మాట్లాడుతూ చేపల విక్రయ కేంద్రాన్ని తరలించేందుకు తీసుకున్న చర్య అవమానీయమన్నారు. తైబజార్ పేరుతో చేపల విక్రయదారులు మున్సిపాలిటీకి పన్నులు కడుతున్నారని, అలాంటి వారికి ప్రత్యామ్నం చూపకుండా ఉన్న ఫలంగా తరలించేందుకు చర్యలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. తరలించేందుకు చెత్తవేసి అడ్డుకోవడం సరికాదన్నారు. ఇది మున్సిపాలిటీ బాధ్యతరహితానికి నిదర్శనమన్నారు. చెత్తలో చనిపోయిన జంతువుల కళేబరాలు ఉండడంతో సమీప దుకాణాదారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడ్డారని, జనా సంచారంలో చెత్త వేయడం తీవ్రమైన చర్యగా అభివర్ణించారు. కుటుంబాల పోషణకు ముదిరాజ్, గంగపుత్రులు చేపలను విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారని, అలాంటి వారి జీవనోపాధికి గండి పెట్టారని పత్యనాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. చేపల విక్రయదారులను తరలించడానికి తీసుకున్న చర్యను బిఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బాధ్యతతో మున్సిపాలిటీ చేపల విక్రయందారులకు స్థలాన్ని కేటా యించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే నివాస ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యను పరిష్కరించాలని కోరుతూ మున్సిపాలిటీ కమీషనర్ శ్యాంసుందర్ ఆంధోళనలో పాల్గొన్నవారు చుక్క నిరంజన్‌గౌడ్, తల్లోజు రామకృష్ణ, సయ్యద్ ఖలీల్, గుత్తి బాలస్వామి, ఎనుముల రమేష్, వడ్డె వెంకటేష్, పూసలి భాస్కర్, వడ్డెమోని శివకుమార్, వస్పుల సాయిలు, మల్లేష్‌నాయక్, లండం యాదయ్య, ముజాహిద్, మద్దూరి ఆనంద్, జంతుక కిరణ్, రంజిత్, లండం గిరి, అరుణ్‌కుమార్, రాములు, అఫ్రోజ్, యాదయ్య, విఠాయిపల్లి రమేష్, కొమ్ము ప్రసాద్, విక్రమ్, అల్లాజి, సైదులు, యాదమ్మ, బాలకృష్ణ, రాంబాబు, గణేష్‌నాయక్ ఉన్నారు.

# పోలీసు సిబ్బందితో వార్షిక నేర సమీక్ష



**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** తాండూరు సబ్ డివిజన్‌లోని అందరూ పోలీస్ అధికారులు,పోలీస్ సిబ్బందితో కలిసి జిల్లా ఎస్పీ కోటిరెడ్డి వార్షిక నేర సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ తాండూరు డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని నమో దు అవుతున్నటువంటి కేసుల వివరాలు తెలుసుకొని తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది.నిత్యం రద్దీగా ఉండే తండూరు పట్టణ ప్రాంత సరిహద్దుల లో జరుగుతున్న వాహన ప్రమాదాలను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.గత సంవత్సరంలో పోలీస్లే ఈ సంవత్స రం రోడ్డు ప్రమాదాలు మరియు ఆత్మహత్యలు తగ్గాయని వాటిని మరింత నియంత్రించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.ఉన్నత అధికారుల యొక్క సలహాలు సూచనలు నేరుగా సిబ్బంది వరకు వెళ్లాలని,సిబ్బంది పోలీస్ స్టేషన్ లోని అన్ని విషయాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రతి పోలీస్ అధికారి తమ లక్ష్యాను ఏర్పాటు చేసుకోవాలని లక్ష్యాలను సాధించుటలో నిరంతరం శ్రమించాలన్నారు.ప్రతి అధికారి పోలీస్ స్టేషన్‌లో తమ పాత్రను సమర్ధవంతంగా నిర్వహించి ప్రజలకు పోలీస్ డిపార్ట్‌మెంట్‌పైన నమ్మకం కల్గించాలన్నారు.పోలీస్ అధికారులు తమ తమ పోలీస్ స్టేషన్ పరిధి లోని ప్రజలలో రోడ్డు సెఫ్టీ ,సైబర్ నేరాలే,రోడ్డు ప్రమాదాలు,షిటీంలు,100 డైల్ తదితర విషయాల పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు.ఫంక్షనల్ వెర్టికల్ లో ఏమైనా లోపాలు ఉంటే వెంటనే సరి చేసుకొని వెరిటికల్‌లో జిల్లాకు మంచి పేరు వచ్చే విధంగా విధులు నిర్వహించాలని తెలిపారు.అదే విధంగా అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను తగ్గించాలని తమ పోలీస్ స్టేషన్ పరిధిలో సిసి టివిలు ఏర్పాటు చేసుకోవడం ,నేర నియంత్రణలో మూడవ కన్నుగా పరిగణించే సిసి కెమెరాల నిఘాను పెంచాలని ప్రతి గ్రామంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.కర్ణాటక రాష్ట్ర సరిహద్దుగా ఉన్న తాండూరు సబ్ డివిజన్ నుండి జిల్లాలోకి నిషేదిక వస్తువుల అక్రమ రవాణా జరగడానికి అవకాశం లేకుండా ప్రతి నెల రెండు సార్లు కార్డన్ సెర్చ్ నిర్వహించాలని సూచించారు.కావున ప్రతి ఒక్కరూ విధులలో నిర్లక్ష్యం చేయ కుండా ఉండాలని కష్టపడి పని చేయడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ ప్రతి పోలీస్ సిబ్బందితో మాట్లాడి సమావేశానికి సం బంధించిన విషయాలు అడిగి తెలుసుకోవడం జరిగింది.

# తూంకుంట మున్సిపాల్టీ సాధారణ సమావేశంలో పలు నిర్ణయాలు

-పలు పనులకు ఆమోదం పొందిన వైనం
-సమావేశ వివరాలను ఆలస్యంగా వెల్లడించిన కమిషనర్

**శామీర్‌పేట, డిసెంబరు 14, ప్రభాతవార్త** తూంకుంట మున్సిపాల్టీ సాధారణ సమావేశంలో అభివృద్ధికి సంబంధించి పలు నిర్ణయాలు తీసుకుని పనులకు సమావేశంలో ఆమోదం పొందారు. బుధవారం ఈ విషయాన్ని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జైతురామ్‌నాయక్ వెల్లడించారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావు అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగినట్లు దీనిలో పలు పనులకు ఆమోదం పొందటం జరిగినట్లు వివరించారు. 3వ వార్డు అంతాయిపల్లి గ్రామానికి సంబంధించిన వైకుంఠ దామం ఏర్పాటుకు 30లక్షల రూపాయలు, 16వ వార్డులో శానిటేషన్ విభాగరంలో కన్వర్వేటీవ్ మెటీరియల్,శానిటేషన్ సిబ్బంది కొరకు రక్షణ పరికరాలు కొనుగోలుకు 10లక్షల రూపాయలు, ఘన వ్యర్థాల నిర్వాహణ నిమిత్తం డిఆర్‌సి సెంటర్ వద్ద వ్యర్థాల భాగంగ కొన్ని హానికర వ్యర్థాలను సాంకేతికంగ ప్రాసెస్ చేయటానికి ఒక ఇన్స్‌రేటర్, బ్రిక్ మౌల్టెడ్ మిషన్ కొనుగోలుకు 20లక్షల రూపాయలు పనులకు ఆమోదం తీసుకున్నారు. అదే విధంగ స్వచ్ఛ సర్వేక్షణ్-2023 సంబంధించిన వివిధ కార్యక్రమాలు ఇన్‌ఫర్‌మేషన్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్‌లో భాగంగ సిడిఎంఎ సర్కులర్ ఫ్లెక్సీలు, పాంప్లెట్లు, పోస్టర్‌లు ఆడియో, వీడియో ప్రసారాలు, వాల్ రైటింగ్స్, హోర్డింగ్స్ అంచనా 5లక్షల రూపాయలు ఖర్చుకు కేటాయిస్తూ సమావేశంలో ఆమోదం పొందినట్లు వివరించారు. ఈ సాధారణ సమావేశంలో చైర్మన్ కె.రాజేశ్వర్‌రావుతో పాటు కమిషనర్, కౌన్సిలర్లు, మేనేజర్, ఎఇ, ఇతర విభాగాలకు సంబంధించిన అధికారులు హాజరైనట్లు కమిషనర్ జైతురామ్‌నాయక్ తెలిపారు.

### -ఇంతకీ..మున్సిపల్ సమావేశంలో ప్రజాప్రతినిధులు ఏమి చర్చించారు..?

ఇదీ ఇలా ఉండగ అయితే తూంకుంట మున్సిపాల్టీ సాధారణ సమావేశంలో మున్సిపాల్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఏమి చర్చించారు..వార్డుల వారీగ ఏ సమస్యలపై కౌన్సిలర్లు చర్చించారు. ఏమైనా అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఇచ్చారా..నిధుల మంజూరు కోసం కోరారా..సమస్యలపై దృష్టి సారించారా, సభా దృష్టికి తెచ్చారా లేదా అనే విషయం తెలియకుండ పోయింది. పత్రికా విలేకరులకు,మీడియాకు ఈ సాదారణ సమావేశంకు అనుమతి లేదంటూ ముందు నుంచే అధికారులు చెబుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే కనీసం సాదాణ సమావేశం పూర్తి జరిగిన తరువాత కూడ అదే రోజున సమావేశంలో చర్చించిన విషయాలు ప్రజాప్రతినిధులు కాని, కమిషనర్, సంబంధిత అధికారులు కాని వెల్లడించకపోవటం జరుగుతుంది. మంగళవారం జరిగిన సాదారణ సమావేశ వివరాలు కొంత మేరకు మాత్రం బుధవారం ఒక ప్రకటనలో కమిషనర్ వెల్లడించటం జరిగింది. తూంకుంట మున్సిపాల్టీ ప్రజలకు చైర్మన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్ల, కోఆప్షన్‌సభ్యుల, కమిషనర్, సంబంధిత అధికారుల, పనితీరు సమావేశంలో చర్చించిన వివరాలు, ప్రజాప్రతినిధుల ప్రశ్నలు, అధికారుల సమాధానాలు ఎలా ఉన్నాయనే వివరాలు తెలియకుండ పోతుందని ఈ విషయం అందరిలోనూ చర్చనీయాంశం మారిందని చెప్పవచ్చు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు ఎంత వరకు తమ పాత్రను నిర్వహిస్తున్నారు..అధికారుల పనితీరు ఎలా ఉంది. ఏ విషయాలు కూడ తెలియకుండ పోతున్నాయి. సాధారణ సమావేశంకు సంబంధించి అదే రోజున మున్సిపాల్టీలోని ఏ ఒక్క ప్రజాప్రతినిధి కూడ, ఏ అధికారి కూడ సమావేశంలో జరిగిన విషయాలను తరువాత కూడ వివరించక పోవటం కూడ చర్చనీయాంశంగ మారుతుంది. ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలు పనితీరు ప్రజలకు తెలియాలంటే సమావేశంలో చర్చించిన విషయాలు వెల్లడించినపుడే ప్రజాప్రతినిధులకు గుర్తింపు వస్తుందని చెప్పవచ్చు. మరీ ప్రజాప్రతినిధుల్లో మరింత చైతన్యం రావాల్సిన అవసరం ఉంది. ప్రజల చేత ఎన్నుకోబడిన కౌన్సిలర్లు సమస్యలపై, అభివృద్ధిపై ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని పలువురు భావిస్తున్నారు.

### మండల ప్రజా పరిషత్ కాంప్లెక్స్ షాప్‌ల కిరాయికి సీల్డ్ టెండర్ల ఆహ్వానం : ఎంపిడివో

**నర్సాపూర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** మండల ప్రజాపరిషత్ కాంప్లెక్స్ కిరాయి కోసం సీల్డ్ టెండర్లును ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఓ మార్టిన్ లూథర్ తెలిపారు. ఈసందర్భంగా బుధవారం ఆయన మాట్లా డుతూ మండల షాపింగ్ కాంప్లెక్స్‌లో కిరాయి దారులు జూలై 2020 పెంచబడిన కిరాయి చెల్లించటానికి అంగీకరించక పోవడంతో 1 నుండి 19 వరకుగల షాప్‌లను నూతన వ్యక్తులకు కేటాయించుట కై సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. టెండర్లు ఈ నెల 14 నుండి 20వ తేదీ సాయంత్రం వరకు స్వీకరించబడతాయని తెలిపారు. షాప్‌లు రోస్టర్ పద్ద తిన కేటియించబడతాయన్నారు.ఈ టెండర్ ప్రక్రియలో పాల్గొన దలిచిన వారు 2500 రూపాయిల డిడి ఎంపిడిఓ ఎంపిపి నర్సాపూర్ పేరిట తీయాలన్నారు. అంతేగాక నిర్ణీత టెండర్ ఫారం ను పూర్తి చేసి 6 వేలు అంతకు పైన కోట్‌చేసి నిర్ణీత సమయంలో టెండర్ ప్రక్రియలో పాల్గొనవ చ్చున్నారు. షాపులు కేటాయించిన మూడు రోజుల లోపు అడ్వాన్స్‌గా 50 వేలు చెల్లించవల్సి ఉంటుందని తెలిపారు ఈసీల్డ్ టెండర్‌లు ఈ నెల 20 తేదీ సాయంత్రం వరకు విప్పబడుతాయని అన్నారు.ఆసక్తి గలవారు మండల ప్రజా పరిషత్ నర్సాపూర్ కార్యాలయ పర్యవేక్షులను సంప్రదించి టెండర్ ప్రక్రియలో పాల్గొనవచ్చని ఎంపిడిఓ మార్టిన్ లూథర్ తెలిపారు.

### శుభాకార్యాలు, పూజల్లో బిజీ బిజీగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతారెడ్డి

**శివ్వంపేట, డిసెంబర్ 14 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బుధవారం జరిగిన శుభకార్యాలు, పూజా కార్యక్రమాల్లో నర్సా పూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు బిజీ బిజీగా పాల్గొని పర్యటిం చారు. గోమారం గ్రామంలో అరుణ్ కన్నెస్వామి నివాసంలో జరిగిన శ్రీఅయ్యప్ప స్వామి పడిపూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా పాంబండ సర్పంచి తలారి శివులు సోదరుని వివాహ వేడుక ల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కాగా గూడూరు గ్రామానికి చెందిన కొత్త కుమ్మరి శ్రీకాంత్ వివాహంలో పాల్గొని వధూవరు లను ఆశీర్వదించారు. పెద్దగొట్టిముక్కుల గ్రామానికి చెందిన మనోహర్ సోదరి వివాహంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డిలు పాల్గొని ఆశీర్వదించారు. కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన అరికెల చంద్రం వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. రత్నాపూర్ గ్రామానికి చెందిన నాయిని వేమారెడ్డి చిన్నారుల పుట్టుపంచెల కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వై. రమణాగౌడ్, టీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షులు పి. సుధీర్‌రెడ్డి, నాయకులు పైడి శ్రీధర్‌గుప్త, నాయిని రామ్మోహన్‌రెడ్డి, బొగ్గుల యాదగిరి పాల్గొన్నారు.

## విద్యార్థులకు అరటి పండ్ల వితరణ

**పాపన్నపేట, డిసెంబరు 14, ప్రభాతవార్త:** 10వ తరగతి విద్యార్థులకు వారం రోజుల పాటు అరటి పళ్లను పంపిణీ చేసేందుకు మండలంలోని అరికెల ప్రాథమిక పాఠశాల హిందీ ఉపాధ్యాయులు అనిల్‌కుమార్ సిద్ధం అయ్యారు. ఉదయం, సాయంత్రం పాపన్నపేట పాఠశాలలో ప్రత్యేక తర గతులకు హాజరవుతున్న విద్యార్థులు ఆకలితో అలమటించకుండా పండ్లు తింటే కొంత ఉత్సాహం పెరుగుతుందని, ఫలితంగా చిత్తశుద్ధితో విద్యను అందుకునే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు అనిల్‌కుమార్ వారం రోజుల పాటు అరటి పళ్లను వితరణ చేయనున్నారు. ఇందులో భాగంగా బుధవారం ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న 140 మంది విద్యార్థులకు అరటి పండ్లను పంపిణి చేసి చక్కగా చదువుకోవాలని సూచించారు.

## ఈకేవైసీ తప్పనిసరి : ఎవో మౌనిక

**మెదక్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం రైతులు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులను పొందడానికి ఈ కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తిచేయాల్సి ఉంటుందని మండల వ్యవసాయాధికారి మౌనిక తెలిపారు. బుధవారం రుద్రారం గ్రామంలో ఈ కేవైసీ పూర్తి రైతుల కోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. మరో వారం రోజుల్లో గడువు ముగియనున్నందున రైతులు త్వరగా ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి లక్ష్మణ్, ఎంపీటీసీ శివకుమార్ తదితరులున్నారు.

### మెరిట్ మున్నూరుకాపు విద్యార్థులకు అవార్డులు

**రామాయంపేట, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** మున్నూరుకాపు కులస్థులకు చెందిన డిగ్రీ, పిజి విద్యార్థులు 80శాతం మార్కులకంటే ఎక్కువ సాధించినట్లైతే రాష్ట్ర మున్నూరుకాపు ట్రస్ట్, కాచిగూడా ద్వారా మెరిట్ అవార్డులు ప్రదానం చేయడుతుందని రాష్ట్ర మున్నూరుకాపు సంఘం ఉపాధ్యక్షుడు దేమె యాదగిరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు 2022వ సంవత్సరంలో ఒకే దఫాలో పాసై ఉండాలని తెలపారు. అర్హులైన విద్యార్థులు మున్నూరుకాపు వెబ్‌సైట్‌లో నుండి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని, తగిన సర్టిఫికేట్‌లు జతచేసి, జనవరి 10వ తారీఖు వరకు అప్లై చేసుకోవాలని ఆయన సూచించారు.

## మరోసారి ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కలిసిన అంసానిపల్లి రైతులు

**కొల్చారం, డిసెంబర్ 14 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అంసానిపల్లి గ్రామానికి చెందిన పోడు భూముల రైతులు నర్సాపూర్ ఎమ్మెల్యే చిలు ముల మదన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఎన్నో సంవత్సరాల నుండి తాము పోడు భూము లను సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని, తమకు అటవీ శాఖ అధికారులు అన్యాయం చేస్తున్నారని, తమ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. అలాగే ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ గల్వ ఇంద్రసేనారెడ్డి, రైతులు రమేష్, శ్రీనివాస్, పోడు భూముల రైతులు తదితరులు ఉన్నారు.

### రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలి : ఎవో శ్వేత

**కొల్చారం, డిసెంబర్ 14 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పీఎం కిసాన్ పథకంలో వచ్చే వాయిదా నుండి ఈ కేవైసీ చేయించుకోని రైతులను అనర్హులుగా భావించి పథకం నుండి తొలగించడం జరుగుతుందని కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేత అన్నారు. బుధవారం ఆమె విలేకరుతో మాట్లాడుతూ గడువు ముగిసిన తరువాత రైతు ఎంత ప్రయత్నించినా పీఎం కిసాన్‌లో అర్హత పొందలేదని, గత కొన్ని నెలలుగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో క్యాంప్‌లు, మీటింగ్‌లు నిర్వహించి ఈ కేవైసీ అప్డేషన్ ప్రక్రియ పలు మార్లు చేపట్టడం జరిగిందన్నారు. ఇంకా కొందరు రైతులు ఈ కేవైసీ అప్డేషన్ చేయించలేదని, దీనికి మరో రెండు రోజుల గడువు మాత్రమే ఉన్నందున రైతులు గమనించి వెంటనే దగ్గరలోని సీఎస్‌సీ సెంటర్ల ద్వారా ఈ కేవైసీ అప్డేషన్ చేసుకోవాలని సూచించారు.

### పేదింటి ఆడ బిడ్డల పెళ్లిళ్లకు పుస్తెలు, మెట్టెలు అందజేత

**నర్సాపూర్, డిసెంబర్ 14, ప్రభాతవార్త :** బుధవారం నర్సాపూర్‌లో ఇద్దరి పేదింటి ఆడబిడ్డల పెళ్ళిళ్ళకు బండారి గంగాధర్ పుస్తెమెట్టెలను అందజేశారు. రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన చిగురి లలిత నర్సింలు దంపతుల కూతురు అనూష వివాహానికి, నర్సాపూర్ పట్టణానికి చెందిన అబ్బాస్ స్వరూప దంపతుల కూతురు చందనాకీర్తి వివాహానికి బుధవారం శివ్వంపేట మండలంలోని పిల్లుట గ్రామానికి చందిన ప్రముఖ సంఘ సేవ కుడు, సేవారత్నా అవార్డు గ్రహీత, టిఆర్‌ఎస్ పార్టీ మండల కోశాధికారి బండారి గంగాధర్ తన వంతు సహాయంగా ఇద్దరికి పుస్తెమెట్టెలు అంద జేశారు. అనంతరం ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా వధువుల కుటుంబీకుల, బంధువులు బండారి గంగాధర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఇప్పటివరకు ఎంతో మంది పేదింటి వధువుల వివాహాలకు ఆయన పుస్తె మెట్టెలు అందజేస్తూ బండారి గంగాధర్ మెదక్ ఉమ్మడి జిల్లాలోనే అందరికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఈ కార్యక్రమంలో పెద్దపులి సతీష్, సంతోష్,మహేష్, విష్ణు, పాల్గొన్నారు.

### అందుబాటులోకి వినూత్న స్టోరేజీ పరిష్కరణలు

నాగారం డిసెంబర్14,ప్రభాతవార్త : దేశంలోని కంటెంట్ సృష్టికర్తలు మరి యు వృత్తి నిపుణుల కోసం తన శాన్‌డిస్క్ ప్రొఫెషనల్ బ్రాండ్ ద్వారా వెస్టన్ డిజిటల్ కొత్త ఆవిష్కరణను విడుదల చేసింది.కంటెంట్ క్రియేటర్‌లు నేడు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటైన-కంటెంట్ మేనేజ్‌మెంట్ నిర్వహణలో సహాయపడేందుకు ఈవినూత్న స్టోరేజీ పరిష్కరణలను కంపెనీ అందుబాటులోకి తీసుకువచ్చింది.కొత్తగా విడుల చేసి ఏడు ఉత్పత్తులలో శాన్‌డిస్క్ ప్రొఫెషనల్ ప్రో జి40టిఎం,ఎస్ఎస్‌డి,జి రైడ్ టిఎం షటిల్ ఎస్ఎస్‌డి,జి-డ్రైవ్ టిఎం ఎంటర్ ప్రైజ్ క్లాస్ డెస్క్‌టాప్ హార్డ్ డ్రైవ్ ప్రో-డాక్ 4-4 బే రీడర్ డాకింగ్ స్టేషన్ ఉన్నట్లు వెల్లడించింది.

## బిఆర్ఎస్ కార్యాలయ ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఘట్‌కేసర్ మండల నాయకులు



ఢిల్లీలో బీఆర్ఎస్ కార్యాలయ ప్రారంభోత్సవ వేడుకల్లో మంత్రి మల్లారెడ్డితో కలిసి పాల్గొన్న ఘట్‌కేసర్ మండల నాయకులు

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 14, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండల పూర్వపు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఢిల్లీలో బీఆర్ఎస్ కార్యాలయ ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డితో కలిసి ఘట్‌కేసర్ పూర్వపు మండల నాయకులు మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మంద సంజీవరెడ్డి, బోడుప్పల్ మేయర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డిలు సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో స్థాపించిన బీఆర్ఎస్ జాతీయ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఘట్‌కేసర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎన్. రమేష్, కొర్రెముల గ్రామ సర్పంచ్ ఒరుగంటి వెంకటేశ్ గౌడ్ తదితరులు పార్టీ జాతీయ కార్యాలయ ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

## తుల్జభవాని మాతపూజ నిర్వహించిన సర్పంచ్



.పూజ కార్యక్రమంలో పాల్గోన్న నాయకులు.

**బొంరాస్‌పేట్, డిసెంబర్14, ప్రభాతవార్త :** గిరిజనుల ఆరాధ్యదైవం తుల్జభవాని మాతపూజను బొంరాస్‌పేట్ మండలం బాపల్లితాండ గ్రామసర్పంచ్ కవితసోమ్‌నాథ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సుభిక్షంగా ఉండాలని తుల్జభవాని మాతకు ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పండుగ రైతులు పండించే పంటలు సంవృద్ధిగా పండాలని, పాడిపశువులనుసుభిక్షంగా ఉండాలని కోరుతూ పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తాలుక అధికార ప్రతినిధి టీటీ రామునాయక్, పిఎసిఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్‌ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపిపి నారాయణరెడ్డి, తాలుక యూత్ అధ్యక్షులు నరేష్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగే శ్రీనివాస్, మైనార్టీ నాయకులు జావిద్, మల్లేష్‌గౌడ్, బీసి అధ్యక్షులు రవిగౌడ్, రమణరెడ్డి, జగన్, బాట్యా, వెంకట్‌రాములు పాల్గోన్నారు.

## సామాజిక సేవలో యువత ముందుండాలి

-మండల బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడిని సన్మానించిన ఎస్పీ కోటిరెడ్డి



బిఆర్ఎస్ మండల అధ్యక్షున్ని సన్మానిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

**యాలాల డిసెంబరు 14, ప్రభాతవార్త :** సామాజిక సేవలో యువత ముందుండాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి పిలుపునిచ్చారు. మెరుగైన సమాజ నిర్మాణంలో యువత కీలక భూమికను పోషించాలని ఆయన ఆకాంక్షించారు. గత రెండు నెలల క్రితం యాలాల మండలం దేవనూర్ గ్రామానికి చెందిన భారత రాష్ట్ర సమితి మండల విభాగం అధ్యక్షులు కొమరంపు ప్రవీణ్‌కుమార్ యాలాల ఎస్ఐ. అరవింద్ సూచన మేరకు నిఘా నేత్రాలను విరాళంగా అందజేశారు. సుమారు రూ 1లక్షా 40 వేల విలువ చేసే 16 నిఘా నేత్రాలను ప్రవీణ్ పోలీసులకు విరాళంగా అందజేయడం జరిగింది. బుధవారం ఎస్పీ కోటిరెడ్డి తాండూరు పోలీస్ సబ్ డివిజన్‌ను సందర్శించారు. ఈ క్రమంలో సమాజిక సేవలో పాలుపంచుకున్న ప్రవీణ్‌కుమార్‌ను కరణ్‌కోట పోలీస్ స్టేషన్‌కు పిలిపించి శాలువా, పూల దండలతో ఘనంగా సన్మానించారు. సిసి కెమెరాల ఏర్పాటునకు ధాతలు ముందుకు రావాలని ఎస్పీ సూచించారు. నేరాల అదుపులో నిఘా నేత్రాల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ఒక్క సిసి కెమెరా వంద పోలీసులతో సమానమని ఎస్పీ అభిప్రాయపడ్డారు. నేరాలను వీలైనంత త్వరగా ఛేదించడంలో నిఘా నేత్రాలు ఎంతో ఉపయోగపడతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాండూరు డిఎస్పీ శేఖర్‌గౌడు, సిఐలు రాజేందర్‌రెడ్డి, రాంబాబు, ఎస్ఐలు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌సీఓ రోలింగ్ ట్రోఫీ ప్రదానం



ట్రోఫిని అందజేస్తున్న దృశ్యం

**మొయినాబాద్, డిసెంబర్ 14 (ప్రభాతవార్త):** సాంఘిక సంక్షేమ గురుకుల హెచ్‌ఆర్‌ఆర్ పశ్చిమ రీజియన్ పాఠశాల, కళాశాలకు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఆర్‌సీఓ రోలింగ్ ట్రోఫి ప్రధానం చేయడం జరుగుతుంది. హెచ్‌ఆర్‌ఆర్ వెస్ట్ రీజియన్ పరిధిలో మొత్తం 16 పాఠశాలలు, ఒక డిగ్రీ కళాశాలు ఉన్నాయి. 2022 -23 సంవత్సరానికి చేవెళ్లలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాంశాల, కళాశాల ఆర్‌సిఓ రోలింగ్ ట్రోఫిని కైవసం చేసుకుంది. దీనికి పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. రీజియన్‌లోని అన్ని పాఠశాలలో నిర్వహించిన వివిధ అంశాలైన స్కాలాస్టిక్, కో స్కాలాస్టిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్, ఇగ్నైట్‌ఫేస్ట్ , మెంటర్-మెంటీ ఆరోగ్య పరిశుభ్రత వంటి అంశాలను పరిగణంలో నితీసుకుని అన్నింటిలో ముందంజలో ఉన్నందున ఆర్‌సీఓ రోలింగ్ ట్రోఫిని ప్రధానం చేయడం జరిగిందని తెలిపారు.

## జర్నలిస్ట్‌పై ప్రైవేట్ స్కూల్ యజమాన్యం దాడి

**పరిగి డిసెంబర్14, ప్రభాతవార్త :** పరిగి పట్టణంలో ఉన్న ప్రైవేటు పాఠశాల జెడిహెచ్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులచే పని చేపిస్తుంటే ఆ విషయం తెలుసుకొని విలేకరులు వెళ్లి పాఠశాల సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థులను చదువుకోవడానికి పంపిస్తున్నారు. కానీ మీరు విద్యార్థులచే పని చేయిస్తున్నారని అడగడం జరిగింది. విలేకరులు ఫోటోలు వీడియోలు తీస్తుంటే పాఠశాల యజమాన్యం విలేకరిపై దాడికి దిగారు. విలేకరిపై దాడి చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పరిగి బస్టాండ్ ముందు నిరసన తెలిపారు. అనంతరం ఎంఈఓ హరి చందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు.

## పాము కాటుకు మహిళా మృతి

**బషీరాబాద్, డిసెంబరు 14, ప్రభాతవార్త:** నిద్రపోతున్న మహిళను సోమవారం అర్ధ రాత్రి త్రాచుపాము కాటువేసింది. బషీరాబాద్ మండల పరిధిలోని మైల్వార్ గ్రామానికి చెందిన శివమ్మ (47) నిద్రలో ఉండగా పాము కాటువేసింది. విషయం గమనించిన మహిళా కుటుంబ సభ్యులకు తెలుపగ హుటాహుటిన తాండూర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికి ఆమె పరిస్థితి విషమించడంతో వికారాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం నాడు మృతి చెందినట్లు కుటుంబికులు తెలిపారు.

# పోలీసు స్టేషన్లను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ కోటిరెడ్డి



**తాండూరు టౌన్ డిసెంబర్14, ప్రభాతవార్త :** తాండూరు పరిధిలోని కరన్ కోట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఆఫీసును జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తనిఖీ చేశారు. వార్షిక తనిఖిల్లో భాగంగా బుధవారం కరణ్ కోట్ పోలీస్ స్టేషన్ ,సర్కిల్ ఆఫీసును జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్, సర్కిల్ ఆఫీసులకు సంబంధించి అన్ని విభాగాలను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్‌లోని అన్ని కేసుల వివరాలు అడిగి తెలుసుకొని వాటి యొక్క స్థితిగతులపై చర్చించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ...ఎటువంటి ఫైల్ పెండింగ్‌లో పెట్టరాదని ప్రతి కేసులోని నేరస్తులకు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్వెస్టిగేషన్ అధికారి క్వాలిటీ ఇన్వేస్టిగేషన్ చేయాలని నేరస్తుల ఎట్టి పరిస్థితుల్లో తప్పించుకోకూడదని తెలియజేశారు. ఇప్పటివరకు కేసుల చెదనలో మంచి ప్రదర్శన కనబర్చరాని ఇక ముందు కూడా ఇదే విధంగా ప్రతిభ కనబరుస్తూ, ప్రజలకు పోలీస్ వ్యవస్థ పట్ల నమ్మకం కలిగించాలని అన్నారు. ప్రజలకు పోలీసులు మరింత చేరువకావాలని అధికారులకు సూచించారు. పోలీస్ శాఖలో అమలు పరుస్తున్న వర్టికల్స్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, సిబ్బందికి కావాల్సిన అన్ని సదుపాయాలను సమకూర్చాలని అన్నారు. ప్రతి ఒక్క పోలీసు సాంకేతికంగా పూర్తి అవగాహన కలిగి ఉండి అవసరమైన సమయంలో తగు రీతిలో సాంకేతీక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని, నూతన సాంకేతిక విషయాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి నేరాలు జరగకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించుకొని దానికి అనుగుణంగా పెట్రోలింగ్ నిర్వహించాలని కరణ్ కోట్ సర్కిల్ జిల్లా సరిహద్దుగా ఉన్నందున పక్క రాష్ట్రల నుండి జిల్లాలోకి ఎలాంటి అక్రమ రవానా జరగకుండా ప్రతి రోజు వాహనాలు తనిఖీ చేయాలని బ్లూ, కోర్స్, పెట్రోల్ కార్ విధులు నిర్వర్తించే వారు విజిబుల్ పోలిసింగ్ చేయాలని కంటిన్యూ పెట్రోలింగ్ చేస్తూ ఉండాలని ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అక్రమ వ్యాపారాలు చేసే వారిపై నిఘా ఏర్పాటు చేయాలని, సమస్యలు సృష్టించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అవసరమైతే రౌడి సీట్స్ ఓపెన్ చేయాలని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఉండటం వలన చాలా అప్రమత్తంగా ఉండాలని ప్రతి ఒక్క వాహనంపై నిఘా పెట్టాలని అక్రమాలకు పాల్పడకుండా నివారించాలని తెలిపారు. అలాగే సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుని ఏమైనా సమస్యలు ఉంటే తమపై అధికారులకు సూచించాలని లేనిచో నేరుగా నన్ను సంప్రదించాలని వాటిని పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తాండూర్ డిఎస్పీ శేఖర్, కరణ్ కోట్ సిఐ రాంబాబు, కరణ్ కోట్ ఎస్ఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు మెదడు వాపు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ వేయించాలి : కలెక్టర్ నిఖిల



**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** జిల్లాలో ఒకటి నుండి 15 సంవత్సరాలలోపు పిల్లలందరికీ మెదడు వాపు వ్యాధి సోకకుండా జపనీస్ ఎన్సపాలిటీస్ వ్యాక్సినేషన్ వేసేందుకు చర్యలు చేపట్లాని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ నిఖిల ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జెఈ వాక్సినేషన్‌పై జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఒక సంవత్సరం నుండి 15 సంవత్సరాల లోపు పిల్లలందరికి జేఈ టీకా ఇవ్వడానికి సంబంధిత శాఖల అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. ఒకటి నుంచి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ మున్సిపల్ పరిధిలో గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాలలోని పాఠశాలల్లో వ్యాక్సినేషన్ వేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎఎన్ఎం ,ఆశవర్కర్లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలందరికి టీకాలు వేసే విధంగా నోడల్ అధికారులను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఒకటి నుండి పదిహేను సంవత్సరాల వయస్సుగల పిల్లలు 1లక్ష 79వేల 619 మంది ఉన్నట్లు తెలిపారు. మెదడు వాపు వ్యాధి పందులు, పక్షులు, క్యూలెక్స్ దోమల ద్వారా 15 సంవత్సరాల కంటే తక్కువ ఉన్న పిల్లలకు సోకుతుందని, ఈ వ్యాధి సోకకుండా ఉండేందుకు జేఈ టీకా సమర్తవంతంగా పని చేస్తుందన్నారు. అన్ని గ్రామ పంచాయతీలతో పాటు, పిల్లల తల్లిదండ్రులకు వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు వ్యాక్సిన్ వేయించుకునేలా చూడాలన్నారు. గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు నిర్వహించే గ్రామ సభలలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా రెవెన్యూ అశోక్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్వాన్ కుమార్, డాక్టర్ మారియా, జిల్లా విద్యాశాఖ అధికారి, రేణుక దేవి ,జిల్లా సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, డివిజన్ పంచాయతీ అధికారి అనిత, వైద్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## టిఫిన్ ఆర్డర్ ఇచ్చారు... చీటింగ్ చేశారు..

-అకౌంట్ నుండి డబ్బులు కొటేసిన సైబర్ నేరగాళ్లు

**మర్పల్లి డిసెంబర్ 14 ప్రభాతవార్త :** హోటల్ యజమానికి టిఫిన్ ఆర్డర్ ఇచ్చి డబ్బులు ఆకౌంట్‌లో వేస్తామని యజమానిని నమ్మించి అకౌంట్ నుండి డబ్బులు కొట్టేసిన సంఘటన మర్పల్లిలో చోటుచేసుకుంది భోటల్ యజమాని సునిల్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం హోటల్ యజమానికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తను ఆర్మీ సిబ్బందిని మర్పల్లి మండలంలో రేను శిక్షణ ఉందని తమకు 80ప్లేట్ల ఇడ్లీ పూరి కావాలని తెలుపుతు తన ఐడెంటి కార్డును వాట్సాప్‌కు పంపి డబ్బులు అకౌంట్లో వేస్తామని అందుకు మీ ఏటిఎం రెంబర్ కావాలని అడిగినట్లు తెలిపాడు అందుకు తను ఫోన్‌పే చేయమని



వృదాగా మారిన టిఫిన్ పార్సల్

కోరగా ఫోన్ పే రాదని ఏటిఎం నెంబరతో అకౌంట్‌కు వేస్తామని మమ్మించారు గిరాకి వచ్చాంది. కదా అనుకొని టిఫిన్ ఆర్డర్ తీసుకొని ఏటిఎం కార్డునెంబర్ ఇచ్చాడు రాత్రి 4గంటలకు లేసి బార్యభర్తలు ఇడ్లి పూరి చేసి వాటిని పార్సల్ చేసి సిద్దంగా ఉంచారు ఎంతకి వారు రాక పోవడంతో అనుమానం వచ్చి వాట్సాప్ పరిశీలించాగా ఐడెంటి రార్డు వివరాలు డిలీట్ కాగా అకౌంట్‌లో ఉన్నా3500 రుపాయలు పోయాయని యజమాని తెలిపారు.

విడ్లీలకు పూరీలకు కావలసిన సర్కులతో పాటు తమ శ్రమ డబ్బులు పోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. చేసిన టిఫిన్‌ను తెలసిన వారికి పంచిపెట్టామని వివరించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## జిల్లా వ్యాప్తంగా అభివృద్ధికి నిధులు సక్రమంగా వినియోగించాలి

-మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్

-ప్రతి మండలానికి ప్రత్యేక అధికారుల నియామకం, పర్యవేక్షణ బాధ్యతలు



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్, పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, పలువురు అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబరు 14, ప్రభాతవార్త** మేడ్చల్ జిల్లా వ్యాప్తంగ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అందే నిధులను సక్రమంగ వినియోగించాలని, పనులను వేగవంతం చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన అధికారుల సమీక్ష సమావేశంను కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగ కలెక్టర్ హరీశ్ మాట్లాడుతూ జిల్లాలో 15మండాలాలు ఉండగ మండలానికి జిల్లా స్థాయి అధికారులను ఒక్కో మండలానికి ప్రత్యేక అధికారులుగ నియమించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. మండలానికి కేటాయించిన ప్రత్యేక అధికారులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు నిధులకు సంబంధించి ఎప్పటికపుడు పరిశీలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని ఎన్ని అభివృద్ధి పనులు మంజూరు ఉన్నవి, ఎన్ని పనులు ఏ స్థాయిలో ఉన్నాయనే వివరాలను తెలుసుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అన్నారు. మండలాల్లో ప్రత్యేక అధికారులు పనుల ఖర్చులకు సంబంధించి వివరాలను ఎప్పటికపుడు సమీక్షించాలని, అవసరమైన పనులను చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించటం వల్ల అభివృద్ధి పనులు వేగవంతం చేయటానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి నెలా ప్రత్యేక అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించి సమీక్షిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, జిల్లా సిపిఓ మోహన్‌రావు, జిల్లా స్థాయి అధికారులు, ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

-సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపు



చేవెళ్లలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

**చేవెళ్ళ, డిసెంబర్ 14, ప్రభాతవార్త** ఈ నెల 20వ తేదిన నిర్వహించే కలెక్టరేట్‌ల ముట్టడిని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో చేవెళ్ల నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రభుత్వమే కట్టించాలన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వంలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. దళితులపై. మైనార్టీలపై దాడులు విపరితంగా పెరిగాయన్నారు. ప్రభుత్వాలకు గుణపాఠం చేప్పేందుకు ప్రతి ఒక్కరు సిద్దం కావాలన్నారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గ కౌన్సిల్ కన్వీనర్‌గా రామస్వామి, కో కన్వీనర్‌గా ప్రభులింగం, ఇందిరాపాటి గోపాల్‌రెడ్డి, సభ్యులుగా సత్తిరెడ్డి, ఎండి మగ్బూల్, శ్రీనివాస్, జంగయ్య, సుదీర్, రఘురాం, మంజూల, జలీల్, రుక్కయ్య, మోదిన్, నర్సింలులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఐటియుసి కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మండల పార్టీ కార్యదర్శులు సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శి ఎండి మగ్బూల్ తదితరులు పాల్గొన్నారు.

## 17 నుంచి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస పూజలు

**కొడంగల్, డిసెంబర్14 ప్రభాతవార్త** పేదల పెన్నిధిగా పేరుగాంచి రెండవ తిరుపతిగా వెలుగొందుతున్న కొడంగల్ శ్రీమహలక్ష్మీ వేంకటేశ్వర దేవాలయంలో ఈనెల 17 నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. తిరుమల తిరుపతి దేవాలయంలో మాదిగానే ఆలయంలో ప్రతిరోజు వేకువ జామున సుప్రభాత సేవతో మొదలుకొని శ్రీమాన్ ధరూరి శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో తీరుప్పావై పారాయణం పఠనం కార్యక్రమం ఉంటుందన్నారు. ధనుర్మాస పూజల్లో స్వామి వారికి విశేష అలంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్ మాట్లాడుతు ఈనెల 16న సాయంత్రం 6:12 గంటల నుంచి ధనుస్స సంక్రమణ జరుగుచున్నందున ఈనెల 17 శనివారం నుంచి ప్రారంభమైయ్యే ధనుర్మాస పూజలు జనవరి 14 వరకు ధనుర్మాస పూజలు కొనసాగుతాయన్నారు. అలాగే జనవరి 14 శనివారం భోగిపండుగ నాడు గోదాదేవి కళ్యాణోత్సవం, సాయంత్రం తిరుచ్చి ఉత్సవ ఊరేగింపు ఉంటుందన్నారు. 15న మకర సంక్రాంతి ఉత్తరాయణ పుణ్యకాలం సాయంత్రం 4 గంటలకు శ్రీవారి తిరుచ్చి ఉత్సవం, 16న సోమవారం కనుము పండుగ నాడు పద్మావతి అమ్మవారికి అలంకరణ పుష్కరిణి ఆవరణలో కనుమ పం డుగ ఉత్సవం అలంకరణ తిరుమంజనం ఉత్సవం వైభవంగా కొనసాగ నున్నట్లు తెలిపారు. ధనుర్మాస పూజల్లో భాగంగా భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గోదాదేవి కళ్యాణోత్సవం జరుపబడుటకు భక్తులు రూ.1551 చెల్లించి తమ గోత్రనామాలతో ఆల యంలో సంప్రదించాలన్నారు. మార్చి నెలలో 18 నుంచి 27 వరకు శ్రీమ హలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.



శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

## పరిగిలో కాంగ్రెస్ నాయకులు ధర్నా

**పరిగి డిసెంబర్14, ప్రభాతవార్త :** తెలంగాణ కాంగ్రెస స్ట్రాటజీ హెడ్ ఆఫీసును మంగళవారం పోలీసులు సీజ్ చేయడంతో బుధవారం టిపిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పిలుపు మేరకు డిసిసి అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పరిగి మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పరిగి బస్టాండ్ ముందు సిఎం కెసిఆర్ దిష్టబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో పరిగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరశురామ్ రెడ్డి, పరిగి పట్టణ ఉపాధ్యక్షుడు రామకృష్ణ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు నస్కల్ అశోక్ ,ఐజాజ్, డిసిసి కార్యదర్శులు మాధవ రెడ్డి, రామచంద్రయ్య, పరిగి మండల్ సేవాదళ్ అధ్యక్షుడు చిట్యాల రాజపుల్లా రెడ్డి, లక్నపూర్ సర్పంచ్ వెంకటయ్య, సుల్తాన్‌పూర్ మాజీ సర్పంచ్ తార్య నాయక్, సీనియర్ నాయకులు రామకృష్ణ, మహిళా కాంగ్రెస్ నాయకురాలు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## చేవెళ్ల బిజెపి ఒబిసి కన్వీనర్‌గా వెంకటేష్‌గౌడ్



నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

**మొయినాబాద్, డిసెంబర్ 14 (ప్రభాతవార్త):** బిజెపి ఓబిసి చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా ఎల్లని వెంకటేష్‌గౌడ్ నియమితులైయ్యారు. మండల పరిధిలోని బాకారం జాగిర్‌గ్రామానికి చెందిన వెంకటేష్‌గౌడ్‌లకు జిల్లా ఒబిసి అధ్యక్షుడు లక్ష్మీనారాయణ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పజెప్పిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పని చేసేందుకు అందరం కలిసికట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కంజర్ల ప్రకాష్, ఉపాధ్యక్షుడు నక్కలపల్లి జంగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, టీ శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కుమార్, మహేందర్ ముదిరాజ్, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఢిల్లీలో బీఆర్ఎస్ కార్యాలయ ప్రారంభంలో పాల్గొన్న ఎమ్మెల్యే



ఢిల్లీలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంత్రి సబితమ్మతో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

**కొడంగల్, డిసెంబర్ 14ప్రభాతవార్త** దేశ రాజధాని ఢిల్లీలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ప్రారంబోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తరలివెళ్ళారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అద్వర్యంలో ఢిల్లీలోని తాత్కాలిక భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన యాగంలో మంత్రులు హరీష్‌రావు, సబితాఇంద్రారెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం బీఆర్ఎస్ పార్టీ ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమె ్మల్యే విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతు సీఎం కేసీఆర్ అద్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ రానున్న రోజుల్లో దేశ రాజకీయాల్లో కీలకం కానున్నదని పేర్కొన్నారు.

## విద్యార్థులకు ఉచిత యూనిఫాంల పంపిణీ



విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్

**కొడంగల్, డిసెంబర్ 14ప్రభాతవార్త** కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ తండా ప్రాధమిక పాఠశాలలో విద్యార్థులకు మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్ ఉచిత యూనిఫాం దుస్తులను పంపిణీ చేశారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్దులకు రెండవ విడత ఉచిత యూనిఫాం దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్దుల విద్యాబివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యాబివృద్ధిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు, ఎస్ఎంసీ చెర్మేన్ బాబ్యానాయక్, అంగన్‌వాడీ టీచర్ రమాదేవిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సోషల్‌మీడియాను చూసి భయపడుతున్న కెసిఆర్



కేసిఆర్ డిష్టిబొమ్మ తగులబెడుతున్న కాంగ్రెస్ పార్టి నాయకులు

**కుల్కచర్ల డిసెంబర్ 13, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టి సోషల్‌మీడియాను చూసి సిఎం కేసిఆర్‌కు నిద్రపట్టడం లేదని కాంగ్రెస్ పార్టి కుల్కచర్ల మండల అధ్యక్షుడు బిఎస్ ఆంజనేయులు, పరిగి టిఆర్ఆర్ సోషల్‌మీడియా కన్వీనర్ పడిగెల భీంభాస్కర్ ఆరోపించారు. బుధవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టి వార్‌రూమ్‌పై పోలీసుల దాడిని నిరసిస్తూ కేసిఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టి సోషల్‌మీడియా చేస్తున్న ప్రచారాన్ని టిఆర్ఎస్, బిజేపి పార్టీలు భయపడుతున్నాయని కాంగ్రెస్ పార్టి శ్రేణుల దగ్గరికి వస్తే ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరి గోపాల్‌నాయక్, మండల సోషల్‌మీడియా అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్, స్తానిక వార్డు మెంబర్ మోత్కూరి వెంకటేష్, బూత్ ఎన్‌రోలర్ ఐలగారి కృష్ణయ్య, గోవర్దన్‌రెడ్డి, కర్రె నర్సిములు, తలారి నర్సిములు పులింగ వెంకటేష్, యాసిన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గడ్డమీది తండా రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



**తలకొండపల్లి డిసెంబర్14, ప్రభాతవార్త :** టిఆర్ఎస్ ప్రభుత్వం తండాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని సర్పంచ్ ఈశ్వర్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే నిధుల నుండి మంజూరైన నిధులతో తలకొండపల్లి మండల పరిధిలోని గడ్డమీది తండా రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గడ్డమీది తండా రోడ్డుకు 4లక్షల రూపాయలు గర్వ్యా తండా రోడ్డుకు రూ.1లక్షల మోరం పోయడానికి ప్రోసిడింగ్ ఇచ్చిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ఎన్ దశరథ్ నాయక్, వార్డు మెంబర్లు బి. రాములు, ఈ. రమేష్, పి. జంగ దశరథ్, నాయకులు భీంలాల్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.